క్లుప్తంగా

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం త్యాగరాజస్వామి సంగీత కళాక్షేత్రంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం పాతపాళెం లాస్య, పుసుపులేటి సుదీక్షల భరతనాట్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి నిర్వహించిన సంగీత కచ్చేరికి మంచి స్పందన లభించింది. సంఘ నేతలు డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, పొన్నూరు చంద్ర, జువ్వలదిన్నె సురేష్, రుద్రకోట మనోహర్, గంగపట్నం సందీప్, ఉట్లపల్లి మనోహర్, రాపూరు సురేష్, వేణు, ఈశ్వరయ్య, నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా జాతర



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కొలువైన ఢిల్లీపోలక్షమ్మ జాతర చివరి రోజు ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత అమ్మవారికి మహా నివేదన, మంగళహారతి, సాయంత్రం ప్రభలు, కలిశ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో జరిగింది. చివరగా అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల నడుమ విద్యుద్దీపాలంకరణలో గ్రామ వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారికి భక్తులు పండ్లు, కొబ్బరికాయ, కర్పూర హారతులు పట్టి పూజలు చేశారు. జాతర సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

గ్రామాల్లో పర్యటిద్దాం



వైస్ ఎంపీపీ సుజాత, నారసింహారెడ్డిని సత్కరిస్తున్న శేషగిరి

కొడవలూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పూర్తిగా విఫలమైందని, దీనిని గ్రామస్థాయిలో పర్యటించి వివరిద్దామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి కోరారు. మండలంలోని నాయుడుపాళెం, గండవరం, యల్లాయపాళెంలలో ఆదివారం ఆయన పర్యటించి స్థానిక సంస్థల ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ప్రజారంజక పాలన అందిస్తే కూటమి ఆరు నెలల్లోనే ప్రజాగ్రహానికి గురైందని చెప్పారు. శేషగిరి కలిసిన వారిలో వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాత, నాయకులు నారసింహారెడ్డి, మాగుంట గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, అడపాల మోహనకృష్ణ, ఉమామహేశ్వరరావు, చింతా చలపతి, ప్రసాద్‌రెడ్డి, పెంచలయ్య, బండ్ల మోహన్, యుగంధర్‌రెడ్డి, తాటిపర్తి భాస్కర్, జడ్డా అమరావతి ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు కొట్టే మల్లికార్జున, బొచ్చు శ్రీనివాసులు, సర్పంచ్ మోర్ల రమేష్‌లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



ముత్తుకూరు : గ్రామాల్లో దోమల ఉధృతి అధికంగా ఉందని, వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆందోళన వెలిబుచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు వారు సమస్యలను తెలియజేశారు. ఎంపీపీ గండవరం సుగుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ నాగమణి మాట్లాడుతూ, ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమలు నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచ్‌లకు సూచించారు. నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంఈఓ హేమసుందర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఆరు జెడ్పీ హైస్కూళ్లకు ఆరు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయని, విద్యాశాఖ తాజా ఉత్తర్వుల మేరకు వీటిని మూడు కాంప్లెక్స్‌లకు కుదించామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షుడు చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

మండల పరిధిలో రేషన్ బియ్యం తీసుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో సరైన సమయానికి రేషన్ సరుకులు అందక కార్డుదారులు పడుతున్న కష్టాలు ఇంతింత కాదు. పాత పద్ధతిలో సరుకులు పంపిణీ చేస్తుండడంతో ప్రజలకు సరైన సమాచారం లేక అష్టకష్టాలు పడుతున్నారు.

- పట్టణంలో కార్డుదారులకు ఇబ్బందులు
- ఐదు ఎండీయూ వాహనాల సరెండర్
- పాత పద్ధతిలోనే సరుకుల పంపిణీ

తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఎండీయూ వాహనాలు



రేషన్ కష్టాలు ఇంతింత కాదయా!

పొదలకూరు : కూటమి ప్రభుత్వం పాత పద్ధతిలోనే సరుకులను అందజేస్తున్నా ఎండీయూ(మొబైల్ డిస్పెన్స్ యూనిట్) వాహనాలను కొందరు సరెండర్ చేశారు. దీంతో ఎండీయూ వాహనాల లాగిన్‌లోనే సంబంధిత రేషన్‌షాపుల డీలర్లు సరుకులను అందజేయాల్సి ఉంటుంది. దీంతో డీలర్లతో పాటు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల్లేని ప్రాంతాల్లో ఒక్కసారిగా కార్డు హోల్డర్లు డీలర్ల వద్దకు వచ్చి పడుతుండడంతో అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పొదలకూరు పట్టణంలో అధికంగా ఉంది. ఇక్కడ ఉన్న రెండు వాహనాల్లో ఒకదానిపై 6ఏ నోటీస్ ఇచ్చి నిలిపివేయగా మరొక వాహనానికి సంబంధించిన వారు రాజీనామా చేశారు. దీంతో సరుకుల పంపిణీ ఇబ్బందిగా మారినట్టు తెలుస్తోంది. సూరాయపాళెం, విరువూరు, బిరదవోలు, ఆర్‌వైపాళెం, మొగళ్లూరు, తోడేరు వాహనాలను సరెండర్ చేశారు.



ఎండీయూ వాహనం ద్వారా పంపిణీ(ఫైల్)



రేషన్ షాపు వద్ద ఇస్తున్న సరుకులు

మండలానికి 11 వాహనాలు

పొదలకూరు పెద్ద మండలం కావడంతో గత ప్రభుత్వంలో 11 ఎండీయూ వాహనాలను కేటాయించారు. ఇవి వంతుల వారీగా మొత్తం 59 రేషన్ షాపుల గ్రామాల్లో బియ్యంతో పాటు, సరుకులను పంపిణీ చేసేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎండీయూ విధానాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. ఇందుకోసం ప్రజల అభిప్రాయంతో పాటు సర్వే నిర్వహించారు. పౌరసరఫరాల పంపిణీ వ్యవస్థలో ఎండీయూ వాహనాల పాత్ర కీలకంగా ఉందని, ఈ విధానాన్ని తొలగిస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే అభిప్రాయాలు సర్వేలో వెలువడడంతో ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసుకుంది. ఫలితంగా ఎండీయూ ద్వారానే ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వహిస్తున్నారు. అయితే 11 వాహనాల్లో 6 వాహనాలను నిర్వాహకులు సరెండర్ చేశారు. మిగిలిన ఐదు వాహనాలు పనిచేస్తుండగా అతికీలంగా ఉన్న పట్టణంలో రెండు వాహనాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి.

డీలర్లకు మూడేసి రోజులు

పట్టణంలో మొత్తం ఏడుగురు రేషన్‌షాపుల డీలర్లు ఉన్నారు. ఎండీయూ వాహనాలు లేకపోవడం వల్ల వాటి లాగిన్‌లోనే ప్రతి డీలర్ మూడేసి రోజుల వంతున బియ్యం, సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పౌరసరఫరాల శాఖ అధికారులు డీలర్లకు తేదీలను నిర్ణయించారు. ఆ ప్రకారం డీలర్లు సరుకులను అందజేయాల్సి ఉంటుంది. ఇందువల్ల కార్డు హోల్డర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా డీలర్ల వద్దకు వెళ్లే కార్డ్ హోల్డర్లు జనాల తాకిడితో బారులు తీరాల్సి వస్తోంది. డీలర్లు సైతం పంపిణీ చేయలేక ఆపసోపాలు పడుతున్నట్టు వాపోతున్నారు. పట్టణంలో ఒక్కో డీలర్‌కు సుమారు 500 నుంచి 600 కార్డులు ఉన్నాయి.

ఎండీయూ లాగిన్లోనే పంపిణీ చేయాలి

పట్టణంలో ఎండీయూ వాహనాలు లేకపోవడం వల్ల డీలర్లు వాటి లాగిన్లోనే సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం డీలర్లకు ప్రతినెలా తేదీలను నిర్ణయించి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేయిస్తున్నాం. డీలర్లకు మూడేసి రోజుల వంతున కేటాయించి బియ్యం అందజేస్తున్నాం.

– ఐ.రవి, డీఎస్‌డీటీ, పొదలకూరు

అ'పూర్వ' సమ్మేళనం



సర్వేపల్లిలో ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. నాటి విద్యార్థులంతా ఒకచోట చేరి ఒకరినొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ కుటుంబసభ్యులను పరిచయం చేసుకుని ఆనందంగా గడిపారు. పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించి, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన రిటైర్డ్ హెచ్ఎం వెంకయ్య, ఉపాధ్యాయినులు సుగుణ, ఇందిర, సుకన్య, పద్మావతి తదితరులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా మదర్సా వార్షికోత్సవం



బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని ఖాజానగర్‌లో అల్ అమిన్ మదర్సాలో వార్షికోత్సవాన్ని ఇమామ్ అహమ్మద్ రజా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేశారు. అనంతరం షేక్.బాషా సాహెబ్ నూరి సహకారంతో ఖురాన్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



విజేతలకు బహుమతుల ప్రదానం

ఇందుకూరుపేట: క్రీడాకారులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎన్నెస్ఆర్సీసీ (ఏడో మైలు), ద్వితీయ స్థానంలో నిలిచిన పున్నూరు జట్టుకు బహుమతులను అందజేశారు. క్రీడా పోటీల వ్యవస్థాపకుడు జానా గిరిబాబు, కార్పొరేటర్ జానా నాగరాజు, మంచికంటి సుధాకర్, కమిటీ సభ్యులు రంగారావు, మధు, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

ముత్తుకూరు : ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరు నగరంలో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య వెల్లడించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 3వ తేదీన ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఇంటికో మనిషి, ఊరికో బండి అనే నినాదంతో ప్రతీ గ్రామంలో ప్రచారం చేస్తున్నామన్నారు. నాయకులు నక్కా రాఘయ్య, చేవూరు మల్లికార్జున, దుంపల ఏడుకొండలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

వైభవంగా గొబ్బెమ్మల నిమజ్జనం

పొదలకూరు : పొదలకూరు పంచాయతీ వెంకటేశ్వరనగర్(తోకంచి)లో ఆదివారం వైభవంగా గొబ్బెమ్మల నిమజ్జనోత్సవం నిర్వహించారు. తెలుగుగంగ పునరావాస కేంద్రమైన వెంకటేశ్వర్‌నగర్‌లో సంక్రాంతి సందర్భంగా సుమారు నెలరోజుల పాటు గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి పాటలు పాడి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. మహిళలు కోలాటం ప్రదర్శిస్తూ గొబ్బెమ్మల గ్రామోత్సవంలో పాల్గొని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

ఎన్ఎస్సార్ క్రికెట్ టోర్నీ విజేత కొమ్మలపూడి



కొమ్మలపూడి జట్టు సభ్యులు

మనుబోలు : సంక్రాంతి సందర్భంగా మనుబోలు జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన మండలస్థాయి ఎన్ఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను కొమ్మలపూడి జట్టు గెలుచుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కొమ్మలపూడి జట్టు నిర్ణీత ఓవర్లలో 88 పరుగులు చేయగా ఆపై మనుబోలు జట్టు 54 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ మేరకు విజేత జట్టుకు రూ.20 వేల నగదు బహుమతిని ఎస్సై శివరాకేష్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే రన్నరప్ జట్టుకు రూ.15 వేల నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలు ఉపకరిస్తాయన్నారు. టోర్నీకి స్పాన్సర్‌గా వ్యవహరించిన నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

ఆలనా పాలన కరువు

మండలంలోని గండవరం, కొడవలూరులో ఉన్న షాదీ మంజిల్‌లు ఆలనా పాలన లేక నిరుపయోగంగా మారాయి. మందుబాబులకు అడ్డాగా మారింది. గతంలోని టీడీపీ ప్రభుత్వం వీటిని నిర్మించి మౌలిక వసతులు కల్పించకుండా వదిలేయడం వల్లే ఈ దుస్థితి నెలకొంది.

- నిరుపయోగంగా షాదీ మంజిల్‌లు
- పట్టించుకోని పాలకులు



నిరుపయోగంగా ఉన్న గండవరంలోని షాదీ మంజిల్

కొడవలూరు : రాష్ట్రంలో 1996–99 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా షాదీ మంజిల్‌లు నిర్మించింది. అదే సమయంలో మండలంలోని గండవరం, కొడవలూరుల్లో షాదీ మంజిల్‌లు నిర్మించారు. అయితే వీటిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కొడవలూరు షాదీ మంజిల్‌లో అరకొర వసతుల నడుమ ప్రారంభించగా కొత్తలో ఒకట్రెండు వివాహాలు జరిగాయి. ఆ తరువాత నుంచి నిరుపయోగంగానే మారింది. గండవరంలోనైతే ఏ ఒక్కరూ వివాహాలు చేసుకున్న దాఖలాల్లేవు.

ముస్లింలకు ఉపయుక్తం

కొడవలూరు, గండవరంలలో ముస్లిం కుటుంబాలు ఆశాజనకంగా ఉన్నాయి. అందువల్లే ఇక్కడ షాదీ మంజిల్‌లు నిర్మించారు. అయితే కేవలం కాంట్రాక్టర్ కోసమన్నట్లు నిర్మించారే తప్ప కనీస వసతుల గురించి పట్టించుకోలేదు. నీరు, మరుగుదొడ్ల వసతి లాంటి వాటిని పూర్తిగా విస్మరించారు. వీటిని తక్కువ ఖర్చుతోనే ఏర్పాటు చేసే అవకాశమున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. మౌలిక వసతులు కల్పించి ఉంటే పేద, మధ్య తరగతి ముస్లింల వివాహాలు, ఖత్నా, సంఘ సమావేశాల్లాంటివి నిర్వహించుకునే వెసులుబాటు ఉండేది. కేవలం భవనాలు మాత్రమే నిర్మించి వదిలేయడం వల్ల ముస్లింలు ఉపయోగించుకోలేకపోయారు. ముస్లిం మైనారిటీ సంఘాల వారు షాదీ మంజిల్‌ల దుస్థితిని అనేక పర్యాయాలు సీఎంగా ఉన్న చంద్రబాబు దృష్టికి తీసుకుపోయారు. కానీ పట్టించుకున్న దాఖలాల్లేవు.

మందుబాబులకు అడ్డా

ఎన్నో ఏళ్లగా ఇవి నిరుపయోగంగానే ఉండడంతో వీటిని మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. రాత్రి వేళల్లో ఇందులో తిష్ట వేస్తున్నారు. వీటిని ప్రధాన రహదారికి పక్కనే నిర్మించి ఉండడంతో రాత్రి వేళల్లో ఆ దారిన పోవాలంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భీతిల్లుతున్నారు. ప్రస్తుతం చంద్రబాబే ముఖ్యమంత్రిగా ఉన్నందున ముస్లింలపై ఏ మాత్రం గౌరవమున్నా వీటికి నిధులు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలని ముస్లిం వర్గాలు కోరుతున్నాయి.



వినియోగంలో లేని కొడవలూరులోని షాదీ మంజిల్

వినియోగంలోకి తెస్తే ప్రయోజనకరం



మండలంలో రెండు షాదీ మంజిల్‌లు ఉన్నప్పటికీ అవి నిరుపయోగంగానే ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తెస్తే పేద, మధ్య తరగతి ముస్లింలు వివాహాలు, ఇతర కార్యక్రమాలు ఎలాంటి ఖర్చు లేకుండా నిర్వహించుకునే వెసులుబాటు ఉంటుంది. వీటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల ఏళ్ల తరబడి దిష్టి బొమ్మల్లా ఉండిపోయాయి. ప్రజా ప్రతినిధులైనా పట్టించుకుని వినియోగంలోకి తేవాలి.

– సయ్యద్ రఫీ, నార్తురాజుపాళెం, కొడవలూరు మండలం

నిధులు కేటాయించాలి



ఏళ్ల తరబడి రెండు షాదీమంజిల్‌లు నిరుపయోగంగా ఉండిపోవడం వల్ల మరమ్మతులు అవసరమయ్యాయి. వీటికి నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెస్తే ఎన్నో ముస్లిం కుటుంబాలకు ఊరటగా ఉంటుంది. ముస్లింల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న షాదీ మంజిళ్లను వినియోగంలోకి తేవాలి.

– ఎండీ.కరిముల్లా, నార్తురాజుపాళెం, కొడవలూరు